విద్యార్థులకు అవగాహన

మాట్లాడుతున్న కీర్తి చంద్రిక

ఇల్లెందు, ఫిబ్రవరి 11 : మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే అనర్థాలు, అక్రమ రవాణాను అరికట్టడంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇల్లెందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి అన్నారు. మంగళవారం ఇల్లెందు కోర్టు ఏరియాలో ఎస్టీ గిరిజన వసతిగృహంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వాటివల్ల కలిగే దుష్ఫలితాలు, అక్రమ రవాణా అరికట్టడంపై చిన్న వయస్సు నుంచే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు.

నకిలీ విత్తనాలు.. మోసపోయిన రైతులు

కంపెనీ సూపర్‌వైజర్‌ను నిలదీస్తున్న రైతులు

చండ్రుగొండ, ఫిబ్రవరి 11: అధిక దిగుబడులు సాధించవచ్చని నమ్మబలికి అంటకట్టిన మొక్కజొన్న విత్తనాలు నెలలు గడుస్తున్నా పీచు పట్టకపోవడంతో మోసపోయానని రైతులు వాపోతున్నారు. మంగళవారం చండ్రుగొండ మండలం బాల్యతండా గ్రామంలో విత్తన సప్లై చేసిన కంపెనీ సూపర్‌వైజర్‌ను గ్రామస్తులు నిలదీశారు. ఏపీలోని చింతల్‌పూడిలో ఉన్న వసుధ కంపెనీ యాజమాన్యం బాల్యతండా గ్రామంలోని 15 మంది రైతులకు 37 ఎకరాల్లో ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలను గత ఏడాది డిసెంబర్‌లో సప్లై చేశారు. యాజమాన్యమే పంట కొనుగోలు చేస్తుందని, విత్తనాల్లో సమస్య ఉన్నా ఎకరానికి రూ.70 వేలు ఇచ్చేలా రైతులకు హామీ ఇచ్చారు. దీంతో మంగళవారం ఆ గ్రామానికి వచ్చిన సూపర్‌వైజర్‌పై రైతులు విరుచుకుపడ్డారు. ఈ విషయమై కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.

సివిల్స్ అభ్యర్థులకు మాక్ ఇంటర్వ్యూలు

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 11 : ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ మౌఖిక పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థుల కోసం మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద సివిల్స్ ప్రిలిమినరీ పాసైన వారికి లక్ష రూపాయల ప్రోత్సాహం, మెయిన్స్‌లోనూ విజయం సాధించిన వారికి మరో లక్ష ప్రోత్సాహాన్ని అందించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మొక్కలను విరివిగా నాటుదాం : ఎఫ్‌డీవో

మొక్కలు నాటుతున్న ఎఫ్‌డీవో

చండ్రుగొండ, ఫిబ్రవరి 11 : కలప మొక్కలను విరవిగా పెంచుదామని కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని సీతాయిగూడెం నుంచి దామరచర్ల వరకు రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. మొక్కలు నాటడంతోపాటు ఏపుగా పెంచడం కోసం ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు.

పోలింగ్ విధుల పట్ల అవగాహన ఉండాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి అనుసరించి జిల్లా పరిధిలోని ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు మొత్తం 74 మందికి ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోలు, ఏపీవోలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ భిన్నంగా ఉంటుందన్నారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, గడువులోగా పోలింగ్‌కేంద్రం పరిధిలో క్యూలైన్లలో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నంబర్లు అందించి వారికి ఓటింగ్ జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీవోలు తమ పర్యవేక్షణలోనే ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరచారి, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీఎంఎల్‌టీ పూసపాటి సాయికృష్ణ, కిరణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

మాట్లాడుతున్న నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మానే రామకృష్ణ

భద్రాచలం, ఫిబ్రవరి 11: స్థానిక ఎన్నికల్లో గులాబీ సైన్యం సత్తా చాటాలని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు మానె రామకృష్ణ, మండల కన్వీనరు ఆకోజు సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం భద్రాచలం మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని, అధికార కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని, ప్రభుత్వ వ్యతిరేకతే బీఆర్ఎస్ గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. బీఆర్ఎస్ తరపు పోటీ చేసే ప్రతి వ్యక్తి కేసీఆర్ అనే భావనతో ప్రజలందరూ ఓట్లు వేసి గెలిపిస్తారని, గులాబీ సైన్యమంతా ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కో కన్వీనరు రేపాక పూర్ణచంద్రరావు, కొల్లం జయప్రేమ్‌కుమార్, బత్తుల నరసింహులు, అయినాల రామకృష్ణ, పడిసిరి శ్రీనివాస్, ఇమంది నాగేశ్వరరావు, మురాల డానియేల్ ప్రదీప్, సులోమి పాల్గొన్నారు.

బూర్గంపాడు, ఫిబ్రవరి 11: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి అన్నారు. మండలంలోని ముసలిమడుగు గ్రామంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చకపోవడం, హామీలు నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలను ఇంటింటికి వివరించాలన్నారు. నాయకులు పొడి నరేందర్‌కుమార్, కుర్సం వెంకన్న, గుండమల్ల మల్లయ్య, ఎల్ వెంకన్న, ఉసిల్ల నరేష్, కొనకంచి జయరాజు, జి.శ్రీకాంత్, రామారావు, వాసం నాగేశ్వరరావు, ఎస్.ఆదినారాయణ, బుచ్చిరాజు, టి.బాలరాజు, పాయం రాజు, గుగ్గల నారాయణ పాల్గొన్నారు.

గుండె జబ్బు బాలుడికి రూ.10 వేల ఆర్థిక సాయం

బాలుడికి నగదు అందజేస్తున్న దాతలు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 11: ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకొని తదుపరి వైద్య ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ బాలుడికి స్థానిక నేస్తం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆర్థిక చేయూతనిచ్చారు. బూర్గంపహాడ్ మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు పిల్లి సాయికృష్ణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో హైదరాబాద్ నిమ్స్ వైద్యులు ఓపెన్ హార్ట్ చికిత్స ద్వారా కార్డియాక్, కార్డియోథెరోసిస్ సర్జరీ చేసి వాల్వ్ రీప్లేస్‌మెంట్ చేశారు. ఇందుకు సుమారు రూ.10 లక్షలకు పైగా ఖర్చయింది. ఇందులో ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.6 లక్షలుపోగా మిగతా రూ.4 లక్షలను నిరుపేదలైన అతడి తల్లిదండ్రులు అప్పులు చేసి వెచ్చించారు. అతడి తండ్రి నాగరాజు ఆటోడ్రైవర్‌గా, తల్లి నాగశ్రీ పెట్రోలు బంకులో కూలీగా పనిచేస్తూ తమ కుమారుడికి వైద్యం చేయించారు. సర్జరీ అనంతర వైద్య ఖర్చులకూ ఆర్థిక వెలుసుబాటు లేకపోవడంతో ఈ పరిస్థితి గురించి ఇదే మండలంలోని మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తెలుసుకున్నారు. మంగళవారం ఆ బాలుడి వద్దకు వెళ్లి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. బాలుడికి ఇంత చిన్న వయసులోనే ఓపెన్ హార్ట్ సర్జరీ జరగడం తమను ఎంతగానో కలిచివేసిందని అన్నారు. సొసైటీ సభ్యులు చింతా అంకిరెడ్డి, సంకా సురేశ్, ఆవుల శివనాగిరెడ్డి, కైపు రమేష్‌రెడ్డి, డీ.బాలనారాయణరెడ్డి, పేరం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ సుంకు జాతర

దుమ్ముగూడెం : జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 11: ఆదివాసీ గిరిజనుల ఇలవేల్పులైన వనదేవతలు, కోరిన కోర్కెలు తీర్చే తల్లులు సమ్మక్క సారలమ్మ దీవెనలతో ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మణుగూరు పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ అన్నారు. మండలంలోని తోగ్గూడెంలో మంగళవారం నుంచి సమ్మక్క సారలమ్మ సుంకు జాతర ప్రారంభమైంది. మొదటి రోజు అమ్మవార్లను బీఆర్ఎస్ నాయకులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

కరకగూడెం, ఫిబ్రవరి 11: మండలంలోని చిరుమళ్ల గ్రామంలో కొలువైన సమ్మక్క– సారలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. జాతరలో ఘటనలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 11 : జాతరలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై యాయతిరాజు అన్నారు. మంగళవారం అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలోని కట్టమైసమ్మ జాతరను పురస్కరించుకుని ఆలయ ఆవరణను పరిశీలించారు.

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 11 : మండల పరిధిలోని బొజ్జాయిగూడెంలో కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ జాతర(మినీ మేడారం) బుధవారం ప్రారంభం కానున్నట్లు నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, కోటయ్య తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ జాతరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మే 15 వరకు జాతర కొనసాగుతుందన్నారు.

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 11: దుమ్ముగూడెం గ్రామంలో గోదావరి నదీ తీరాన వెలిసిన ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు 9వ రోజు భక్తజనంతో కిటకిటలాడాయి. చివరి రోజు భక్తులు పెద్దసంఖ్యలో జాతరకు తరలిరావడంతో దుమ్ముగూడెంలో పండుగ వాతావరణం నెలకొన్నది.

ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మండల పరిధిలోని మారాయిగూడెం గ్రామంలో కొలువైన సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతర మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు మండ వెలుగుట జాతరను ప్రారంభించారు. అనంతరం జంపన్నవాగు వద్ద భక్తులు, దేవరబాలలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరబాలలు గద్దెలను శుభ్రం చేసి జాతరకు సిద్ధం చేశారు.

రేపు జిల్లా యూత్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ ట్రయల్స్

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 11 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ గురువారం పాల్వంచ శ్రీనివాసకాలనీలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో జిల్లా యూత్ అథ్లెటిక్స్ ఎంపికల ట్రయల్స్ నిర్వహిస్తారని జనరల్ సెక్రటరీ మహిదర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 13వ తేదీ ఉదయం 8గంటలకు అథ్లెటిక్స్ కోచ్ నాగేందర్ (9963659598)కు రిపోర్టు చేయాలని, వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ హనుమంతరావు (7207402792)ను సంప్రదించాలన్నారు.

యువకుడు మృతి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 11: ఆటో ఫైనాన్స్, కుటుంబ సమస్యలతో పదిహేను రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన ఘటన సుజాతనగర్ మండలంలోని లక్ష్మీదేవిపల్లితండా పంచాయతీలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి... లక్ష్మీదేవిపల్లితండాకు చెందిన కున్సోత్ హతీరాం పెద్ద కుమారుడు కున్సోత్ మనోజ్‌కుమార్(23) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆటోఫైనాన్స్‌తో పాటు ఇంట్లో చిన్న చిన్న సమస్యలు, గొడవలు జరగడంతో మనోవేదనకు గురై ఇటీవల పురుగుల మందు తాగాడు. విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

పాల్వంచ, సెప్టెంబర్ 11: భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో క్షణికావేశంలో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పాత పాల్వంచకు చెందిన కటారు ప్రశాంతి(36) మంగళవారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రశాంతికి అదే గ్రామానికి చెందిన కటారు రవిశేఖరశాస్త్రికి 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఇద్దరు ఉన్నారు. సోమవారం రాత్రి భార్యాభర్తల మధ్య మాటామాటా పెరిగి గొడవపడ్డారు. అందరూ నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున ప్రశాంతి హాల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఉదయం నిద్రలేచి చూడగా భార్య మృతిచెంది ఉండటాన్ని గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి బాబాయి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 11: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుట్టమల్లారం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ సమితి సింగారం ఫీడర్‌లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్షయపై అవగాహన ఉండాలి

పినపాక, ఫిబ్రవరి 11: మనిషిని బలహీనపరిచి మరణానికి దగ్గర చేసే క్షయ వ్యాధి (టీబీ)పై సంపూర్ణ అవగాహన ఉండాలని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శృతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. వ్యాధి ముదరక ముందే చికిత్స తీసుకుంటే ఉపశమనం పొందవచ్చునని అన్నారు.

స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 11 : స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏపీయం దుర్గారావు తెలిపారు. మంగళవారం ముకుందాపురం గ్రామంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఫైనాన్షియల్ లిట్రసీ కౌన్సిలర్ నాగేశ్వరరావు, జగన్, సీసీ భూలక్ష్మి, సౌజన్య, కృష్ణకుమారి, నాగమణి, మానస, సైదమ్మ, ధనలక్ష్మి, అరుణ, సురేష్, విజయలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు

చుంచుపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని ధన్బాద్‌లో ఉన్న సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కరాటే పోటీల్లో స్వర్ణం, రజిత పతకాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో 7వ తరగతి చదువుతున్న అబ్దుల్ అయాన్ రజిత పతకం సాధించాడు. వరంగల్ జిల్లా నర్సంపేట ఎంఏఆర్ గార్డెన్స్‌లో 9వ తేదీన జరిగిన జాతీయ కరాటే పోటీల్లో 3వ తరగతి చదువుతున్న జయదీప్ కటా విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు.

మహిళ పై దాడి.. కేసు నమోదు

చుంచుపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని చుంచుపల్లితండా పంచాయతీలో ఓ మహిళపై దాడి జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... పాల్వంచకు చెందిన ఉపాధ్యాయుడు అజ్మీరా హరిదాస్ చుంచుపల్లితండాలో ఉంటున్న హరిప్రియ ఇంటికి తరచూ వస్తున్నాడనే నెపంతో మంగళవారం హరిదాసు భార్య, కుటుంబ సభ్యులు చుంచుపల్లి తండాలోని సదరు వివాహిత ఇంటికి వచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై పోలీసులు చుంచుపల్లి తండాకు చేరుకొని కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

సమ్మర్ యాక్షన్ పనులు ప్రారంభం

పినపాక, ఫిబ్రవరి11 విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దుగినేపల్లి గ్రామంలో మంగళవారం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఛార్జీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం డివిజనల్ ఇంజినీర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండడానికి ముందస్తు ప్రణాళికలో భాగంగా అన్ని సబ్ స్టేషన్‌లో పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లను ఛార్జీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏడీఈ ఉమారావ్, ఏఈ వేణుగోపాల్, సబ్ ఇంజినీర్ వీరారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రైవేట్ కాలేజీల సత్తా

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 11: జాతీయస్థాయి ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలలో ఖమ్మం నగరంలోని తమ విద్యార్థులు సత్తా చాటారని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యజమానుల తెలిపారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనల్లో తమ విద్యార్థులు సాధించిన ర్యాంకులను వెల్లడించారు.

న్యూవిజన్..

న్యూవిజన్ విద్యార్థులతో చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్

జేఈఈ మెయిన్స్ తొలి విడత ఫలితాల్లో న్యూవిజన్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించినట్లు చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. అజ్మీరా రోషిక మణిదీప్ 99.89, ప్రణవ్ 99.87, రమాకౌషిక్ 99.64, అనన్య 99.62, కార్తీక్‌సాయి 99.50, షణ్ముక ప్రియ 99.27, మధురహాసిని చౌదరి 99.12, గుణదీప్ 99.11, బ్రహ్మాణి 99.03, జవహర్ 98.86, చంద్రసాయికృష్ణ 98.67 పర్సంటైల్‌తో రాణించారు. తమ కళాశాల నుంచి 20 మంది విద్యార్థులు 99 పర్సంటైల్‌పైనా, మరి కొందరు విద్యార్థులు ఫిజిక్స్‌లో 100 పర్సంటైల్‌పైనా సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, డైరెక్టర్ సీహెచ్ గోపిచంద్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు అభినందించారు.

శ్రీచైతన్య..

శ్రీచైతన్య విద్యార్థులతో డైరెక్టర్ శ్రీవిద్య

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు 10లోపు, 100 లోపు ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులను సాధించినట్లు శ్రీచైతన్య జూనియర్ కళాశాల డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య తెలిపారు. కుషాల్ 99.96, నిషాంత్ 99.85, జశ్వంత్‌రామ్ 99.53, ప్రణతి 99.44, జోష్నవ్‌కుమార్ 99.29, ఈశ్వర్‌గుప్తా 99.13, భరత్ 99.02, వెంకటేశ్వర్లు 98.58, మైశేషు 98.50, అను 98.49, స్మైలికరెడ్డి 98.39, సాయితేజ 98.32, వశిష్ట్ 98.15 పర్సంటైల్‌తో రాణించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, డీజీఎం చేతన్‌మాథుర్, డీన్స్ వర్మ, కృష్ణ, ఏజీఎంలు చిట్టూరి బ్రహ్మం, ప్రకాశ్, గోపాలకృష్ణ అభినందించారు.

హార్వెస్ట్..

హార్వెస్ట్ విద్యార్థులతో కరస్పాండెంట్ రవిమారుత్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు జిల్లా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నట్లు హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్ తెలిపారు. మొదటి విడత పరీక్షకు 223 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. సాయిచరణ్ 99.98 పర్సంటైల్, సిద్ధార్థ్ 99.89, నవనీత్ 99.63, గౌతమ్ 99.44, నాగయశ్వంత్ 99.05, జస్వంత్ 98.55, ప్రేమ్‌వర్ధన్ 98.05, శ్రీనినాథ్ 97.77 పర్సంటైల్‌తో రాణించినట్లు వివరించారు. 95 పర్సంటైల్‌కు పైగా 16 మంది విద్యార్థులు సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డి అభినందించారు.

రెజొనెన్స్..

రెజొనెన్స్ విద్యార్థులతో డైరెక్టర్లు

జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో రాణించినట్లు రెజొనెన్స్ జూనియర్ కళాశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రుకమార్, కొండా శ్రీధర్ రావు తెలిపారు. వరుణ్ 99.08, సుశాంత్ 98.29, హర్ష 98.85, భార్గవ్ 96.08, దాన్యదీప్ 95.60, తరుణ్‌రెడ్డి 93.86, దర్షిణిశ్రీ 93.84, గాయత్రి 92.58, హర్షవర్ధన్ 90.63 పర్సంటైల్‌తో రాణించినట్లు వివరించారు. సాధారణ గ్రామీణ ప్రాంత విద్యార్థులతో జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించామని అన్నారు. ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి..

కృష్ణవేణి విద్యార్థులతో అధ్యాపకులు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు కృష్ణవేణి జూనియర్ కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. మణిచంద్రసాయి 99.67, ఉమ మహేశ్ 97.79, సుందరయ్య 96.14, శ్రీమంత్ 95.76, మహేశ్‌బాబు 95.57, సాహిత్ 94.70, యశస్వి 93.37, సాయిసంజన 93.17, రోహిత్‌గని 92.94, వైష్ణవి 92.93, సీతారామకృష్ణ 91.70, లక్ష్మీచందు 91.42, దినేశ్ 90.01, మహాతేజ 90 పర్సంటైల్‌తో రాణించినట్లు వివరించారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఏవో నిరంజన్ అభినందించారు.

పోలింగ్‌కేంద్రాల జాబితా ప్రదర్శన

జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో ధన్‌సింగ్

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో మహాలక్ష్మి పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిమిత్తం పోలింగ్‌కేంద్రాల జాబితాను ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించడం జరిగిందని, జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13వ తేదీ లోపు మండల ప్రజా పరిషత్ కార్యాయలంలో సాయంత్రం 5గంటల లోపు తెలియజేయాలని కోరారు.

దమ్మపేట, ఫిబ్రవరి 11 : దమ్మపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను ఎంపీడీవో రవీందర్‌రెడ్డి మంగళవారం ప్రదర్శించారు. ఆయా పంచాయతీలకు సంబంధించి కార్యాలయాల్లో కార్యదర్శులు ఈ జాబితాను ప్రదర్శించారు. ఓటరు జాబితా తుది జాబితాగా ప్రకటిస్తూ నోటీసుబోర్డులో ప్రదర్శించినట్లు ఎంపీడీవో తెలిపారు.